
ప్రజాశక్తి

శుక్రవారం 26 డిసెంబర్ 2025

5

పార్వతీపురం మన్యం



నేడు ఎంఆర్ నగరంలో మన్యం గోబాల సంబరం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 'మన్యం గోబాల సంబరం' కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. స్థానిక ఎంఆర్ నగరం పశువైద్య శాల ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు ఈ వేడుక ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమానికి కలెక్టరు డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించనున్నారు. మేలు జాతి లేగ దూడలు, పొట్టేళ్ల ప్రదర్శనను ఏర్పాటు చేయనున్నారు. నిష్ణాతులైన పశు వైద్యులచే పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, అవసరమైన శస్త్ర చికిత్సలు నిర్వహించబడతాయి. చికిత్స పొందిన పశువులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తారు. కావున పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ శివ్వాల మన్మధ రావు ఒక ప్రకటనలో కోరారు.

4న చలో విశాఖ జయప్రదం చేయండి

సిఐటియు అఖిలభారత మహాసభ, బహిరంగ సభకు పిలుపు

కరపత్రం విడుదల చేసిన ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - పార్వతీపురం

విశాఖలో జరగనున్న అఖిలభారత సిఐటియు మహాసభల్లో కార్పొరేట్ విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలు రూపొందించబోతుందని సిఐటియు ప్రజా సంఘాల నాయకులు అన్నారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో జనవరి 4న చలో విశాఖ బహిరంగ సభను జయప్రదం చేయాలనే కరపత్రాన్ని ప్రజాసంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.రమణారావు, వై.మన్మధరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యనంతరం కార్మిక వర్గం ఎన్నడూ ఎదుర్కోని తీవ్రమైన కష్టాలు నేడు ఎదుర్కొంటున్నదని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా కార్పొరేట్లకు కొమ్ముకాసి కార్మిక ఉద్యమాలను అణచివేసే కుట్రలు చేపడుతున్నాయని అన్నారు. ధరలు ఆకాశాన్ని తాకుతుంటే కార్మికవేతనాలు పాతాళానికి చేరుతున్నాయని, అంబానీ, ఆదానీ కార్పొరేట్ల ఆస్తులు 100 రెట్లు అమాంతంగా పెరుగుతున్నాయని అన్నారు. కావున సిఐటియు లేబర్ కోడ్‌లు రద్దు అయ్యేంత వరకు పోరాడనుందని తెలిపారు. కార్మికవర్గ అనుకూల విధానాలను అమలు చేయించడానికి పాలకవర్గంపై ఒత్తిడి పెంచనుందని, ఈ ప్రత్యామ్నాయ విధానాల కోసం సమరశీల శంఖరావం పూరించనుందని, 5 రోజులు జరిగే అఖిల భారత మహాసభల్లో చర్చించిన విషయాలను జనవరి 4న బహిరంగ సభ ద్వారా దేశవ్యాప్తంగా కార్మిక వర్గానికి పిలుపు ఇవ్వనుందని పేర్కొన్నారు. ఈ మహాసభలకు ఆంధ్రప్రదేశ్ వేదికగా మారడం రాష్ట్ర కార్మికవర్గానికి గర్వకారణమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు జీతాలు పెంచకుండా జీవితాంతం పనులు చేసినా పర్మినెంట్ చేయకుండా చట్టాలు రూపొందిస్తుండడం దుర్మార్గమని మండిపడ్డారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌తో సహా అన్ని ప్రభుత్వరంగ పరిశ్రమలను మూసివేసే కుట్రలు పన్నుతున్నాయని, పెన్షన్‌ను నామమాత్రం చేస్తున్నాయని, లేబర్ కోడ్‌ల పేరుతో బ్రిటీష్ కాలం నాటి నుంచి సాధించుకున్న హక్కులను తొలగిస్తున్నాయని, సంఘాలు, సమ్మెలు పెట్టే హక్కును కాలరాస్తున్నాయని దుయ్యబట్టారు. సర్వ సంపదలు సృష్టించేది కార్మికవర్గం ఒక్కటేనని, మరోవైపున ప్రజలకు తిండిపెట్టే వ్యవసాయ కార్మికుల ఉపాధి చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా ధ్వంసం చేసిందని అన్నారు. కార్మిక, కర్షక ఐక్యతతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను త్రిప్పి కొట్టడమే అఖిల భారత మహాసభల ప్రధాన లక్ష్యమని అన్నారు. కావున చలో విశాఖ బహిరంగ సభకు లక్షలాది కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి గంగునాయుడు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మర్రి శ్రీను, రెడ్డి ఈశ్వరరావు, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రెడ్డి శ్రీదేవి, బి.లక్ష్మి, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పువ్వుల తిరుపతిరావు, రామారావు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ బివి రమణ, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంట జ్యోతి, సిఐటియు నాయకులు ఎన్‌వై నాయుడు, గొర్లి వెంకటరమణ, కొల్లి సాంబమూర్తి, కోరాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చలో విశాఖ కరపత్రాలను విడుదల చేస్తున్న సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు

ప్రపంచ తెలుగు మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

రాజాం : అమరావతిలో జనవరి 3 నుంచి జరిగే ప్రపంచ తెలుగు మహాసభలు పోస్టర్‌ను గురువారం రాజాం యువ రచయితల వేదిక సభ్యులు ఆవిష్కరించారు. విశ్వ సాహితీ కళా వేదిక రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు డాక్టర్ పెద్దింటి ముకుందరావు మాట్లాడుతూ తెలుగు భాష భవిష్యత్తు కోసం, తెలుగు భాష పరిరక్షణ కోసం గజల్ శ్రీనివాస్ పిలుపు మేరకు ప్రతి తెలుగువాడు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో రాజాం రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కొత్త సాయి, ప్రశాంత్ కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహీత, రెడ్ క్రాస్ మెంబెర్ పెంకి చైతన్యకుమార్, సీనియర్ పాత్రికేయులు, వెలుగు పత్రిక సంపాదకులు మరిశర్ల గంగారావు, ప్రముఖ కళాకారులు, ఉపాధ్యాయులు కరణం శంకర్రావు, చీమకుర్తి ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో విజ్ఞానం, సాంకేతికత అందుబాటులోకి రావాలి

హైకోర్టు న్యాయమూర్తి మానవేంద్రనాథ్ రాయ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వ్యవసాయ రంగంలో విజ్ఞానం, సాంకేతికత రైతులకు అందుబాటులోకి రావడం ఎంతో అవసరమని, ప్రకృతి వ్యవసాయ ఆహార ఉత్పత్తులను వినియోగించడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ కోరారు. మండలంలోని గొరడలో వావిలాల బాపూజీ స్మారక వ్యవసాయ విజ్ఞాన సమాచార కేంద్రాన్ని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరితో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వీకులు పండించే ఆర్గానిక్ పంటలను పండించాలన్నారు. రసాయనిక ఎరువులతో పండించే ఆహార ఉత్పత్తులను తినడం ద్వారా ఎన్నో ఆరోగ్య సమస్యలు, రుగ్మతలు, కేన్సర్ వ్యాధి బారిన పడుతున్నామన్నారు. పోషక విలువలు కలిగిన ప్రకృతి వ్యవసాయ పంటలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జట్టు ట్రస్ట్ ప్రకృతి వ్యవసాయ పంటలపై దృష్టి పెట్టడం అభినందనీయన్నారు. దీన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఆనాటి రోజుల్లో స్వాతంత్ర పోరాట యోధుడు వావిలాల గోపాల కృష్ణయ్యతో కలిసి గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో సారా ఉద్యమంలో పాల్గొన్నామన్నారు. గ్రంథాలయాల ఏర్పాటుకు వావిలాల గోపాలకృష్ణ ఎంతగానో కషి చేశారని అన్నారు. యువత విద్యార్థులకు గ్రంథాలయాలు ఎంతగానో విజ్ఞానాన్ని అందిస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే జగదీశ్వరి మాట్లాడుతూ సహజ వ్యవసాయం, రసాయన రహిత పంటల సాగుపై రైతుల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ ఎరువులు మాకొద్దు", "కర్మణ్యేవాధికారస్తే" అనే పుస్తకాలను ఆవిష్కరించడంతో పాటు నాబార్డ్ ఆధ్వర్యంలో రూపొందించిన జీవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి , జిల్లా సెషన్స్ జడ్జి ఎం బబిత, ఎల్విన్ పేట, చినమేరంగి సిఐలు హరి, తిరుపతిరావు, జట్టు వ్యవస్థాపకులు డి పారినాయుడు, ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డొంకాడ రామకృష్ణ, కురుపాం ఎఎంసి చైర్మన్ కద్రక కళావతి, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, తహశీల్దార్ ఎన్ శేఖర్, ఎంఇఒ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి జి.వాసుదేవరావు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ విజ్ఞాన సమాచార కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి మానవేంద్రనాథ్‌రాయ్

పిలిచారు అవమానించారు : మాజీ ఎమ్మెల్యే

మండలంలోని గొరడలో గురువారం నిర్వహించిన వావిలాల బాపూజీ స్మారక విజ్ఞాన వ్యవసాయ సమాచార కేంద్రం ప్రారంభోత్సవం కార్యక్రమానికి ఆహ్వానించి వేదిక పైకి పిలవకుండా అవమానించడం చాలా బాధాకరమని మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. జట్టు ట్రస్ట్ సభ్యుల ఆహ్వానం మేరకు వచ్చిన తాను విటిడిఎ కార్యదర్శిగా ఉన్నానని తెలిపారు. ఆహ్వాన పత్రంలో తన పేరు ఉన్నా వేదికపైకి పిలవకుండా కనీసం పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేమిటోనని మదనపడ్డారు. తన సొంత గ్రామం గొరడలో సమావేశాలు ఏర్పాటు చేసి తనను పట్టించకపోవడం పట్ల చిన్న చూపు చూడడం తగదన్నారు. గతం నుంచి ఈ ప్రాంతంలో సారా ఉద్యమం నుంచి, నేడు ప్రకృతి వ్యవసాయం వరకు అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్న మాజీ ఎమ్మెల్యేకు ఇచ్చిన గౌరవం ఇదేనా అంటూ మండిపడ్డారు. ఇది గిరిజనుల పట్ల చిన్న చూపునకు నిదర్శనం అన్నారు.

వెంకన్నను దర్శించుకొన్న హైకోర్టు జడ్జి

గరుగుబిల్లి : మండలంలోని చిన తిరుపతిగా పేరు గాంచిన తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లను గురువారం ఎపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ దర్శించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ అర్చకులు వివి అప్పలాచార్యులు, ఇఒ బి.శ్రీనివాస్, ఆలయ చైర్మన్ ఎం. పకీరునాయుడు పూర్ణకలశంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జడ్జికి శ్రీవెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేసి ఆలయ విశిష్టతను, అభివృద్ధిని టిటిడి సభ్యులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ప్రముఖ నఖచిత్రకారుడు పల్ల పరిశినాయుడు హైకోర్టు జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసి తను వేసిన నఖచిత్రాయణం, చిత్ర సాహితి పుస్తకాలను బహుకరించారు.



చర్చిలో ప్రార్ధనలు చేస్తున్న మంత్రి సంధ్యారాణి

ప్రేమ, శాంతిని చాటిచెప్పేదే క్రిస్మస్ : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

క్రిస్మస్ పండుగ కేవలం వేడుక మాత్రమే కాదని, అది మానవాళికి ప్రేమ, శాంతి, ఆశను గుర్తుచేసే పవిత్ర దినమని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గురువారం సాలూరు నియోజకవర్గంలోని పలు చర్చిల్లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె క్రైస్తవులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ ఏసు క్రీస్తు ఈ లోకానికి ఒక సాధారణ శిశువుగా జన్మించి, లోకానికి గొప్ప సందేశాన్ని అందించారని, ప్రేమతో జీవించడం, క్షమాగుణంతో ముందుకు సాగడం ఆయన బోధనల సారాంశమని పేర్కొన్నారు. నేటి సమాజంలో నెలకొన్న విభేదాలను వీడి, ఏసు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ఆమె పిలుపునిచ్చారు. అవసరంలో ఉన్నవారిని ఆదుకోవడం, బాధలో ఉన్నవారిని ఓదార్చడమే నిజమైన క్రిస్మస్ సందేశమన్నారు. క్రీస్తు బోధించిన దయ, వినయం, సేవా భావం మనందరి జీవితాల్లో ప్రతిబింబించాలని, ఈ పండుగ ప్రతి ఒక్కరి హృదయాల్లో కొత్త వెలుగును నింపాలని, కుటుంబాల్లో ప్రేమ, సమాజంలో ఐక్యత బలపడాలని ఆమె ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో స్థానిక నాయకులు, చర్చి ప్రతినిధులు, అధిక సంఖ్యలో క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.



చేపల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

తూనికల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం

కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి ఆదేశాల మేరకు పార్వతీపురంలోని ప్రధాన వ్యాపార కేంద్రాల్లో లీగల్ మెట్రాలజీ (తూనికలు మరియు కొలతల శాఖ) అధికారులు గురువారం మెరుపు దాడులు నిర్వహించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల అసిస్టెంట్ కంట్రోలర్ పివి రంగారెడ్డి నేతృత్వంలో ఈ తనిఖీలు జరిగాయి. స్థానిక ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్ వద్ద ఉన్న చేపల మార్కెట్, పెద్ద బజార్‌లోని చికెన్, మటన్, చేపల దుకాణాలు, కిరాణా షాపుల్లో అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో వెలుగులోకి వచ్చిన ఉల్లంఘనలు, ఎలక్ట్రానిక్ ప్లాట్‌ఫారమ్ కాటాలపై మోసానికి సంబంధించి 8 కేసులు నమోదు చేశారు. నిర్ణీత కాల పరిమితిలో కాటాలకు ప్రభుత్వ ముద్రలు వేయించనందుకు 6 కేసులు నమోదయ్యాయి. అలాగే ప్యాకెట్లపై తయారీదారు పేరు, చిరునామా, ధర, తయారీ తేదీ వంటి వివరాలు లేనందుకు 5 కేసులు నమోదు. ఒకే రోజులో వివిధ ఉల్లంఘనలపై 19 కేసులు నమోదు, వినియోగదారులను తూనికలు, కొలతల్లో మోసగిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. వ్యాపారస్తులు తూనికలు, కొలతలలో తేడాలు లేకుండా సరుకులు విక్రయించాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో పార్వతీపురం లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ కె.రత్నరాజు, విజయనగరం ఇన్‌స్పెక్టర్ బి. ఉమా సుందరి, సిబ్బంది పాల్గొన్నారు.

జలపాతాల వద్ద జాగ్రత్తలేవీ?

- పర్యాటకులకు సూచనలిచ్చే గైడ్ లేరీ?
- ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతే బాధ్యులెవరు ?
- టూరిజం అభివృద్ధికి అటవీశాఖ అనుమతులేవీ?

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో సహజ సిద్ధమైన సుందరమైన జలపాతాలున్నాయి. బయట నుంచి చూడ్డానికి ఆకర్షణీయంగా కనిపిస్తాయి. కానీ వాటిలోకి దిగిన తర్వాత ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు కోల్పోయే అవకాశాలు మెండుగా ఉన్నాయి. జలపాతాల్లో ఎక్కడ ఏ ఊబి వుందో, ఎంత లోతుగా ఉందో వెళ్లిన పర్యాటకులకు తెలియదు. జలపాతం దగ్గరకు వెళ్లేసరికి ఆకర్షణీయంగా ఉండడంతో యువకులు అందులో దిగిపోయి ప్రాణాల మీదకు తెచ్చుకున్న దాఖలాలున్నాయి. సాలూరు నియోజకవర్గంలో పాచిపెంట, సాలూరు మండలాల్లో ఆకర్షణీయమైన జలపాతాలు ఉన్నాయి. గత కొన్నేళ్లుగా ఈ జలపాతాలకు వందల సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు. ముఖ్యం కార్తీక మాసంలో వనభోజనాల పేరిట ఈ జలపాతాల సందర్శనకు పర్యాటకులు వస్తున్నారు. అయితే ఈ జలపాతాల వద్ద కనీస మౌలిక సదుపాయాలు లేక పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జలపాతాలకు వెళ్లడానికి సరైన రహదారులు లేవు. ఈ జలపాతాలన్నీ మారుమూల గిరిజన గ్రామాలు, గిరి శిఖర గ్రామాలకు సమీపంలో వున్నాయి. సాలూరు మండలంలోని శిఖ పరువు, దళాయివలస, లొద్ద జలపాతాలు ఉండగా, పాచిపెంట మండలంలో నీలంవలస జలపాతం వుంది. ఈ జలపాతాలకు చేరుకునేందుకు సరైన రహదారులు, అక్కడ తగిన జాగ్రత్తలతో కూడిన మౌలిక సదుపాయాలు వుంటే పర్యాటకుల తాకిడి పెరిగే అవకాశం ఉంది. సీతంపేట మండలంలో ఉన్న జలపాతం వద్ద మౌలిక సదుపాయాలు ఉన్నాయి. జలపాతంతో పాటు ఆహ్లాదకరమైన పార్క్ వుండడంతో ఎక్కువగా పర్యాటకుల రాకపోకలు ఉన్నాయి. అయితే మొక్కుబడి సౌకర్యాలు కల్పించి జిల్లాలో సాలూరు ప్రాంతంలో దళాయివలస, నీలంవలస జలపాతాలను ప్రారంభించారు. వెదురు దుంగలతో తయారు చేసిన మెట్లు, మంచాలను అటవీశాఖ సిబ్బంది ఏర్పాటు చేశారు. ఇలాంటి మొక్కుబడి సౌకర్యాల వల్ల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

పర్యాటకులకు సూచనలిచ్చే గైడ్ లేరీ?

ఈ జలపాతాల వద్ద పర్యాటకులకు తగిన జాగ్రత్తలు తీసుకొనేలా సూచనలిచ్చే గైడ్‌లు ఉండాల్సిన అవసరం వుంది. జలపాతాల వద్ద ఎక్కడెక్కడ ఊబిలో కూరుకు పోయే ప్రమాదం వుందో హెచ్చరించే బోర్డులైనా ఏర్పాటు చేయాలి. లేదా ఆయా జలపాతాలపై పూర్తి అవగాహన కలిగిన, ఈత తెలిసిన యువకులను గైడ్‌లుగా నియమించాల్సి వుంటుంది. ఆ విధంగా సరైన జాగ్రత్తలు సూచించే గైడ్ లేక ఇటీవల దళాయివలస జలపాతం వద్ద ఊబిలో కూరుకు పోయిన ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. అంతేకాకుండా జలపాతాల వద్దకు ఎక్కువగా యువతీయువకులు వస్తున్నారు. ఇక్కడకి వచ్చి వారు మద్యం సేవించి జలపాతాల లోకి దిగుతున్నారు. నాచుతో కూడిన రాళ్లపై నుంచి నీటి ప్రవాహాన్ని ఆస్వాదిస్తున్నారు. మద్యం మత్తులో ఉన్న కొంతమంది యువకులు విచక్షణారహితంగా కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోయిన పరిస్థితులు వున్నాయి. మద్యం మత్తులో ఉన్న వారిని జలపాతాల వద్దకు వెళ్లకుండా నివారించే యంత్రాంగం ఉండాలి. ఏ విధమైన ఏర్పాట్లు లేకపోవడం వల్ల ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా జలపాతాల వద్ద పరిస్థితులు కనిపిస్తున్నాయి.



కురుకూటి వద్ద గల జలపాతం

అటవీశాఖ అనుమతులు ఉన్నాయా?

ఏజెన్సీ ప్రాంతంలో పర్యాటక అభివ ద్ధి లో భాగంగా జలపాతాల నిర్వహణ కు అటవీశాఖ అనుమతులు వుండాలనే నిబంధనలు ఉన్నాయి.అయితే అవేవీ అమలు చేయకుండా జిల్లాలో జలపాతాల ను ఆదరాబాదరాగా ప్రారంభించడం వల్ల ఏదైనా పెనుప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులనే చర్చ జరుగుతోంది.ఎకో డెవలప్మెంట్ కమిటీలు ఏర్పాటు చేసి స్థానిక గిరిజనులు, అటవీశాఖ కు ప్రయోజనం చేకూరే విధంగా చర్యలు చేపట్టాలి.అయితే ఈ జలపాతాల వద్ద అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు.పర్యాటక అభివృద్ధి కోసం అటవీశాఖ అనుమతులు వుండాలనే నిబంధనలు పక్కనపెట్టి జిల్లా అధికారులు ముందుకెళ్లడం వివాదాస్పద మవుతోంది.

గిరిజన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు విడుదల : మంత్రి

విద్యార్థుల ఖాతాల్లోకి నేరుగా నగదు

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలను కూటమి ప్రభుత్వం విడుదల చేసిందని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. గిరిజన విద్యార్థులను ప్రోత్సహించడం, పాఠశాలలు, హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు, మెరుగైన వైద్యం, పౌష్టికాహారం అందించడమే ప్రభుత లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. గురువారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గిరిజన విద్యార్థులకు సంబంధించిన పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల వివరాలను వెల్లడించారు. 2023-24 విద్యా సంవత్సరం గత ప్రభుత్వం కేవలం రూ.18.67 కోట్లు మాత్రమే విడుదల చేసి చేతులు దులుపుకోగా, కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకుని పెండింగ్‌లో ఉన్న మూడు త్రైమాసికాలకు సంబంధించి రూ.71.67 కోట్లను విడుదల చేసిందన్నారు. దీనివల్ల 69,227 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరిందని, ఈ నిధులను నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేశామన్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 42,203 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ కాలేజీల ఖాతాల్లోకి రూ.85.67 కోట్ల నిధులు, విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి రూ.9.11 కోట్ల నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరం ప్రస్తుతం అర్హులైన విద్యార్థులకు నిధుల విడుదల ప్రక్రియ కొనసాగుతోందని, ఇప్పటి వరకు 59,297 మంది విద్యార్థులకు గానూ రూ.100.93 కోట్లు విడుదల చేశామని వెల్లడించారు. గిరిజన విద్యార్థులు ఎటువంటి భయం లేకుండా, ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉన్నత చదువులు చదవాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, భవిష్యత్తులో స్కాలర్‌షిప్‌లను సమయానుకూలంగా విడుదల చేస్తామని, గిరిజన విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించేలా ప్రభుత్వం అండగా ఉంటుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.


ఆర్‌టిసి కొరియర్ కార్యాలయంలో తనిఖీ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మక్కువలో గల ఎపిఎస్ ఆర్టీసీ కొరియర్, పార్సిల్ కార్యాలయాన్ని సాలూరు డిపో మేనేజర్ ఆచారి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులకు ఆర్టీసీ ద్వారా అందుతున్న సేవలు సంతృప్తికరంగా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా కళాశీలతో సాయంత్రం వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకుని, డిపోకు కొత్త బస్సులు వచ్చే అవకాశం ఉందని అప్పుడు కొత్త సర్వీసులు సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే వ్యాపార అభివృద్ధికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో పార్సిల్ కార్యాలయ ఏజెంట్ విశ్వనాథ్ శర్మ పలువురు వినియోగదారులు పాల్గొన్నారు



ఆర్‌టిసి కొరియర్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న సాలూరు డిఎం ఆచారి



ఏజెన్సీలో కురుస్తున్న మంచు

మన్యాన్ని కప్పేసిన మంచు దుప్పటి

ప్రజాశక్తి - కురుపాం

మన్యం ప్రాంతమంతా చల్లటి గాలులు అలుముకోవడంతో గిరిజన గ్రామాలు దుప్పటి కప్పుకున్నట్టుగా కనిపిస్తున్నాయి. మండల కేంద్రంతో పాటు పరిసర గిరిజన గ్రామాల్లో గత రెండు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. తెల్లవారుజామున మూడు గంటల నుంచే మంచు కురుస్తుండడంతో ఎముకల వరకు చలి తాకుతుంది. ఉదయం 8 గంటల వరకు చలి తగ్గకపోగా, సాయంత్రం 4.30 నుంచి మళ్లీ చలితీవ్రత పెరుగుతోంది. తీవ్ర చలితో గ్రామస్తులు చలిమంటల చుట్టూ చేరి వేడి పుచ్చుకుంటున్నారు. మంచు కారణంగా రోడ్లపై మంచి పేరుకుపోవడంతో మైదాన ప్రాంతాల నుంచి గిరిజన గ్రామాలకు వెళ్లే వ్యాపారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలి మరికొన్ని రోజులు ఇలాగే కొనసాగే అవకాశముందని స్థానికులు చెబుతున్నారు.

మహాత్మా గాంధీ పేరును కొనసాగించాలి

ప్రజాశక్తి- బలిజిపేట

2005లో యుపిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రద్దు చేసే కుట్ర పన్ను తుందని మహాత్మా గాంధీ పేరునే కొనసాగిం చాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు అన్నారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాత్మా గాంధీ పేరు తొలగించి విబిజి రాంజీ పేరును పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. మహాత్మా గాంధీ పేరును తొలగించి విబిజి రాంజీ పేరును తొలగించి యథావిధిగా మహాత్మా గాంధీ పేరును కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి వేలాదిమంది ప్రజలకు పని లేకుండా బిజెపి ప్రభుత్వం సిద్ధపడుతుందన్నారు. ఇదే జరిగితే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపాధి లేక వలస బాట పట్టవలసి వస్తుందన్నారు. మహాత్మా గాంధీ పేరు స్థానంలో విబిజి రాంజీ పేరుతో తెచ్చిన నూతన చట్టం వల్ల వేలమంది గ్రామీణ ప్రజలు తీవ్రమైన నష్ట పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేసి ప్రతి కుటుంబానికీ 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కొత్త చట్టాన్ని రద్దు చేయకపోతే గ్రామీణ ప్రజానీకాన్ని ఐక్యం చేసి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు మన్మధరావు, గేదెల సత్యనారాయణ, భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు వేణు



వెలవెలబోతున్న వారపు సంత

వెలవెలబోయిన వారపు సంత

ప్రజాశక్తి – భామిని

భామినిలో గురువారం జరిగిన వారపు సంతతో కొనేవారు లేక వెలవెల బోయింది. ఇక్కడ ప్రతి గురువారం నిర్వహించే వారపు సంతలో చుట్టు పక్కల వున్న గిరిజన గ్రామాలు వారు వచ్చి వారానికి సరిపడా సరుకులు కొనుక్కుంటారు. గురువారం క్రిస్మస్ కావటంతో చాలా మంది గిరిజనులు చర్చికి వెళ్లిపోవటంతో, ఎవరూ సంతకు రాలేదని వ్యాపారాలు తెలిపారు. వ్యాపారాలు లేకపోవటం సంత కొద్ది గంటలకే ముగిసిపోయింది.

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా సిద్దు

ప్రజాశక్తి – భామిని

యుటిఎఫ్ కౌన్సిల్‌లో భామిని మండలానికి చెందిన కె.సిద్దును జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్నారు. జిల్లా యుటిఎఫ్ కౌన్సిల్ ఇచ్చిన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తానని సిద్దు తెలిపారు. భామిని మండలం యుటిఎఫ్ శాఖ సిద్దుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఎపిఎన్‌జిఒ అసోసియేట్ అధ్యక్షులుగా సూర్యనారాయణ

ప్రజాశక్తి – సీతానగరం



మన్యం జిల్లా ఏపి ఎన్‌జిఒ అసోసియేట్ అధ్యక్షులుగా గొర్లె సూర్యనారాయణ (మెడికల్) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి టి.శ్రీధర్ బాబు, సహాయ ఎన్నికల అధికారి ఆవునరేష్ లు తెలిపారు. ఈయన మండలంలోని పెదంకలాం పిహెచ్‌సిలో ఇఒగా పనిచేస్తున్నారు.

ద్విచక్ర వాహనాలు వేలం

ప్రజాశక్తి – పార్వతీపురం టౌన్

అక్రమంగా నాటు సారా రవాణాకు ఉపయోగించి పలు నేరాల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులకు పట్టుబడి కేసు నమోదైన ద్విచక్ర వాహనాలను బహిరంగ వేలం నిర్వహించేందుకు ఎక్సైజ్ ఉన్నతాధికారులు శుక్రవారం ఉదయం 11.00 గంటలకు నిర్వహించనున్నారు. ఆసక్తి గలవారు పార్వతీపురం ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో జరుగు వేలం పాటకు హాజరై ఈ అవకాశాన్ని వేలం పాటదారులు వినియోగించుకోవాలని అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.సంతోష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.



డైరెక్టర్‌కు వినతినిస్తున్న నాయకులు

సమస్యలను పరిష్కరించాలని డైరెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి – సీతంపేట

మాతభాష ఉపాధ్యాయులకు సమాన పనికి సమానం వేతనం రూ.26వేల చెల్లించాలని ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ సదా భార్గవికి ఆదివాసీ మాతృభాష ఉపాధ్యాయ సంఘం నాయకులు విజయవాడ కలిసి వినతిని అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఇందుకు ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ మాతృభాష ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్రకార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స, గిరిజన సంఘం అల్లూరి జిల్లా కార్యదర్శి, మాతృభాష ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షులు సవర ఆనందరావు, కోశాధికారి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి – సీతంపేట

మండలంలోని మెట్టుగూడ జంక్షన్ వద్ద సీతంపేట ఎస్సై వై.అమ్మనరావు వాహనాలు తనిఖీలు చేశారు. యువత నెమ్మదిగా వెళ్లాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఓవర్ లోడ్ వేయరాదని అన్నారు. త్రిబుల్ రైడింగ్ చేయరాదు అన్నారు.

విద్యుత్తు ఉద్యోగుల ఎస్‌టి అసోసియేషన్ డివిజన్ ప్రెసిడెంట్‌గా శంకరరావు

ప్రజాశక్తి– సీతంపేట



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

విద్యుత్ ఉద్యోగుల ఎస్‌టి అసోసియేషన్ పాలకొండ డివిజన్ ప్రెసిడెంట్‌గా కొండగొర్రి శంకరరావు (లైన్‌మ్యాన్), సెక్రటరీగా ముటక భాస్కరరావు (జూనియర్ లైన్ మ్యాన్), కోశాధికారిగా అప్పలస్వామి (జూనియర్ లైన్ మ్యాన్) ప్రధాన సలహా దారులుగా రవి కుమార్ (జూనియర్ ఇంజనీర్), కె. గోపన్న దొర (ఫోర్ మెన్)గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఒకే గ్రామంలో ఏడు చెరువుల ఆక్రమణ

ప్రజాశక్తి–శృంగవరపుకోట

కిల్తంపాలెంలో ఏడు చెరువులు ఆక్రమణకు గురైనట్లు ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల మాలతి కృష్ణమూర్తినాయుడు ఆరోపించారు. మండలంలోని కిల్తంపాలెం పంచాయతీలో ఆక్రమణకు గురైన చెరువులను చెరువుల పరిరక్షణ బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే గ్రామంలో ఏడు చెరువులు ఆక్రమణకు గురైనా అధికారుల దృష్టికి రాలేదంటే అక్కడి పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్వేయరు, విఆర్ఒ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆర్ఐ, ఇరిగేషన్ ఇంజినీర్, ఇఒపిఆర్‌డి క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదా? అని నిలదీశారు. తహశీల్దార్, ఎంపిడిఒలకు వాస్తవ పరిస్థితి తెలుసుకోకుండా ఎందుకున్నారని ప్రశ్నించారు. రైతుల కన్నీళ్లకు, పశుపక్షాదులు అంతరించి పోవడానికి, భూగర్భ జలాలు తగ్గిపోవడానికి, భవిష్యత్ తరాల మనుగడ ప్రమాదంలో పడటానికి కారణం అవుతున్న వీరందరికీ ఏ శిక్ష విధిస్తే సరిపోతుందని ప్రశ్నించారు. వీరికి శిక్ష పడే వరకు పోరాడుతామని తెలిపారు. 'మన ప్రజలను మనమే కాపాడుకుందాం' అనే నినాదంతో చెరువులను కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి– గుమ్మలక్ష్మీపురం

క్రిస్మస్ పండగ శాంతి, ప్రేమ, కరుణ, త్యాగం వంటి మానవీయ విలువలకు ప్రతీక అని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలం లోని ఎల్విన్‌పేటలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దైవ సేవకులతో కలిసి కేక్ కట్ చేసి విశ్వాసులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన క్రిస్మస్ సభలో మాట్లాడారు. పరస్పర సహకారం, సహనం, సోదరభావంతో జీవించడమే క్రిస్మస్ ముఖ్య సందేశమని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఐక్యతతో కలిసి ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ అడ్డాకుల నరేష్, మండ సర్పంచ్ హైమావతి, పాదర్స్, దైవసహాయకులు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : జియ్యమ్మవలస మండలం చినకుదమలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవానికి ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దొంకాడ రామకృష్ణ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్ డివైడ్ పాల్ ఆధ్వర్యంలో సంగీత, నాటిక, ప్రసంగాల కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి దొంకాడ మంగమ్మ, సర్పంచ్ గిరి, విద్యా కమిటీ చైర్మన్ ఎం.అప్పలనాయుడు, సంఘం పెద్దలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక రావాడ రోడ్డులో గల గుడ్‌సమారిటన్ లూథరన్ చర్చి, దొనక వీధిలోని ఇమ్మానియేలు లూథరన్ చర్చిలో క్రిస్మస్ పండగను పురస్కరించుకొని క్రిస్మస్ వేడుకలను పాస్టర్ రెవరెండ్ డి.రాజు ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. కీర్తనలతో చర్చి పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో మారుమోగాయి. ఈ సందర్భంగా పాస్టర్ రాజు క్రిస్మస్ పర్వదినం, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను, ఏసు జనన మానవాళికి శాంతి, ప్రేమ, సేవామార్గానికి ప్రతీకగా నిలిచిందని తెలిపారు. ఈ వేడుకల్లో సంఘ పెద్దలు డి.జాన్, డి.రాజారత్నం, కోట సుందర సుదర్శన్, డి. ప్రదీప్, డి.జయకుమార్‌తో పాటు అధిక సంఖ్యలో క్రైస్తవ విశ్వాసులు పాల్గొని ప్రార్థనలు చేశారు.

పార్వతీపురం టౌన్ : మాజీ ఎమ్మెల్యే అలంగి జోగారావు నివాసం వద్ద మెగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. వైసిపి శ్రేణులు, అభిమానులు, శ్రేయోభిలాషులు ఈ వేడుకలకు తరలివచ్చారు. కార్యక్రమంలో పార్వతీపురం పట్టణం, మండలం, సీతానగరం, బలిజిపేట మండలాల వైసిపి శ్రేణులతో పాటు ఉమ్మడి జిల్లా నలుమూలలా నుంచి అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

వీరఘట్టం: మండలంలోని క్రిస్మస్ పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరఘట్టం తెలుగు బాప్టిస్ట్ దేవాలయంలో పాస్టర్ వి.శంకర్ మాట్లాడారు. చిన్నపిల్లలతో పలు పౌర నాటికలతో పాటు డాన్సులు, తప్పిడ గుళ్ళు ప్రదర్శన చేసి సరదాగా గడిపారు. సంఘ అధ్యక్షులు కళింగ ప్రేమభూషణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శైల ప్రకాష్, కార్యదర్శి నత్తల జకాబ్ దయానంద్, జాయింట్ కార్యదర్శి కళింగ సాల్మన్ రాజ్, కోశాధికారి నత్తల దాలయ్య, జాయింట్ కోశాధికారి ఊజుల ప్రశాంత్ తో పాటు సంఘస్తులు పాల్గొన్నారు.

భామిని : మండలంలోని గిరిజన గ్రామాలైన సన్నాయి కాలనీ, బొడ్డగూడ, యాతంగూడ, బూర్జిగూడ, మూలగూడ, కాజీ పురంలో క్రిస్మస్ సంబరాలు గురువారం ఘనంగా జరిగాయి. క్రిస్మస్ సందర్భంగా గ్రామంలోని సభ్యులంతా కుటుంబం తో కలిసి చర్చికి వెళ్లి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.

సీతంపేట: ఏజెన్సీలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు ఏజెన్సీలో క్రిస్మస్ సందర్భంగా సోమగండి ఆర్‌సిఎం చర్చిలో దివ్యబలి పూజ నిర్వహిస్తున్న ఫాదర్ విద్యాసాగర్ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.



పార్వతీపురం: మాజీ ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు



కురుపాం: కేక్ కట్ చేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ దంపతులు



గుమ్మలక్ష్మీపురం : కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

చెట్టు కింద చదువులు

- విద్యార్థులకు తప్పని అవస్థలు
- మనోవేదనలో గురువులు
- దాతలకోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి– గరుగుబిల్లి

విద్యకు పెద్దపీట వేస్తున్నామంటూ ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకుంటున్న వేళ మండల పరిధిలోని రావివలస గ్రామంలో మాత్రం నేటికీ విద్యార్థుల చదువు చెట్టు కింద కొనసాగుతుండడం పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

ఈ గ్రామంలో మూడు ప్రాథమిక స్థాయి పాఠశాలలు ఉండగా, వాటిలో రెండు పాఠశాలల్లో మొదటి, రెండో తరగతులు నిర్వహిస్తున్నారు. పంచాయతీలో 'స్పెషల్ మోడల్ స్కూల్' గా గుర్తింపు పొందిన పాఠశాలలో మొత్తం 67 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 37 మంది బాలికలు, 30 మంది బాలురు ఉన్నారు. అయితే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఈ స్కూల్లో ఐదో తరగతిలో చదువుతున్న 22 మంది విద్యార్థులు తరగతి గదులు లేక చెట్టు కిందే చదువుకోవాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. ఎండకు మండుతూ, చలికి వణుకుతూ విద్యార్థులు ఆరుబయటే కూర్చొని చదువుకోవాల్సి వస్తుండడం అందరినీ కలచివేస్తోంది. ప్రభుత్వం కొత్త విద్యా విధానాలు, డిజిటల్ క్లాసులు, మెగా పేరెంట్స్ డేలు అంటూ ఆడంబర కార్యక్రమాలు చేపడుతున్నా, కనీసం చదువుకునే గదులు లేకపోవడం అత్యంత బాధాకరమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల భవిష్యత్తును గాలికి వదిలేసినట్టుగా పాలకుల వ్యవహారం ఉందని విమర్శిస్తున్నారు. ఎండ వానల్లో అవస్థలు పడుతూ చదువుతున్న పిల్లలను చూసి తల్లిదండ్రుల గుండెలు పిండేస్తున్నాయని అయినా ఇప్పటివరకు పాఠశాల భవనం నిర్మాణంపై ఒక్క రాజకీయ నాయకుడూ గానీ, ప్రజాప్రతినిధి గానీ సీరియస్‌గా స్పందించకపోవడం దురదృష్టకరమని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా పిల్లల పట్ల చూపాల్సిన శ్రద్ధ మాత్రం మారడం లేదని వాపోతున్నారు. కనీస సౌకర్యాలు లేకుండా చదువు ఎలా సాగుతుందని ప్రశ్నిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థులు ఏకగ్రీవంగా డిమాండ్ చేస్తున్నారు.



ప్రిన్సిపాల్ సొంత డబ్బులతో నిర్మించిన వంట శాల

ప్రిన్సిపాల్ దాతృత్వం

ఇదిలా ఉండగా, అదే పాఠశాలలో పనిచేస్తున్న ప్రిన్సిపల్ ఎస్. స్వర్ణలత తన దాతృత్వాన్ని చాటుకుంటూ మధ్యాహ్న భోజనం వంట చేసేందుకు రేకుల షెడ్‌ను సొంత నిధులుతో నిర్మించారని తల్లిదండ్రులు ప్రశంసిస్తున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం మధ్య ఆమె చూపిన మానవత్వం అందరికీ ఆదర్శంగా నిలుస్తోందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చెట్టుకింద రేకుల షెడ్‌లో చదువులు చెబుతున్న ఉపాధ్యాయుడు

చెట్టు కింద చదువులు కేవలం ఓ గ్రామం సమస్య కాదు, పాలకుల వైఫల్యానికి ప్రతీక. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యార్థులకు శాశ్వత భవనం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

మనోవేదనలో గురువులు

ఇక్కడ చదువుతున్న పిల్లలకు సరిపడా భవనాలు లేకపోవడం, ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న పిల్లల పరిస్థితి చాలా బాధను కలిగిస్తుందని ఉపాధ్యాయులు మనోవేదన చెందుతున్నారు. పిల్లలకు కావలసిన బిల్డింగ్‌ను పాఠశాల ఆవరణంలో ఉన్న స్థలంలో నిర్మించేందుకు ఇప్పటికే కొంతమంది దాతల దృష్టిలో పెట్టామని ఉపాధ్యాలు చెబుతున్నారు.

30న రామతీర్థంలో గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి – నెల్లిమర్ల

వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈనెల 30వ తేదీన రామతీర్థంలో గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు రామతీర్థం సేవా పరిషత్ వ్యవస్థాపకులు జ్యోతిప్రసాద్ తెలిపారు.గురువారం స్థానిక దేవస్థానం ఆవరణలో గిరి ప్రదక్షిణ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామతీర్థం ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం 5 గంటల నుండి 7.30 గంటల వరకు ఉత్తర ద్వార దర్శనాలు వుంటాయని, శ్రీరామస్వామి వారి దర్శనం చేసుకోవచ్చునని చెప్పారు. తర్వాత కొండ మెట్ల వద్ద మెట్లోత్సవం నిర్వహించి, గిరిప్రదక్షిణ ప్రారంభమవుతుందని తెలిపారు. ఎమ్మెల్యే లోకం మాధవితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ ప్రధాన కార్యదర్శి తిరుమరెడ్డి శ్రీనివాసరావు, అర్చకులు నరసింహాచార్యులు, కిరణ్, గోపాలం, సూపరెంటెండెంట్ రామారావు పాల్గొన్నారు.

ఇలాగైతే ఎలా..?

ప్రజాశక్తి – వీరఘట్టం

ఒకప్పుడు పల్లెలు చూసేందుకు ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించేది. ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. పల్లెలని చెప్పుకోవడానికి తప్ప అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. చిన్నపాటి చినుకుపడ్డా రోడ్లు చిందరవందరగా తయారవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని. బల్లగుడ్డు, కె.ఇచ్చాపురం, ఎం.వి.పురం– బిటివాడ, కంబర–కాగితాడ, పివిఆర్ పురం– డిపి వలస, డిపి వలస–బిటివాడ తదితర గ్రామాల రహదారులు నేటికీ అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు కాలువల్లా తయారయ్యాయి. దీంతో ఇలా రోడ్లు ఉంటే ఎలా ప్రయాణించాలంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఈ గ్రామాలకు 104,108 వాహనాలు వచ్చే దాఖలాల్లేవు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు పరిమితం కాకుండా పల్లె రహదారుల అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.



రాళ్లు తేలిన రహదారి

ఆర్గనైజింగ్ సెక్రటరీగా నాగేశ్వరరావు

ప్రజాశక్తి – గుమ్మలక్ష్మీపురం





అరకు పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీగా బాలసింగి నాగేశ్వరరావును ప్రభుత్వం నియమించింది. కార్యకర్తగా కొనసాగుతున్న నాగేశ్వరావు పార్టీ సేవలను గుర్తించిన ఎమ్మెల్యే జగదీశ్వరి ఆర్గనైజింగ్ సెక్రటరీ కోసం అధిష్టానానికి సిఫార్సు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. తనకు ఇచ్చిన బాధ్యతను అంకితభావంతో పని చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. సేవ చేసే అవకాశం కల్పించిన సిఎం నారా చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు.

సీతంపేట : సీతంపేట మాజీ ఎంపిటిసి బిడ్డిక జయలక్ష్మి టిడిపిలో చేసిన పని, కృషి పట్టుదలను గుర్తించిన టిడిపి పార్లమెంట్ కార్యదర్శి పదవిని ఆమెకు కట్టబెట్టింది. జయలక్ష్మి మాట్లాడుతూ తనకు పార్టీలో పార్లమెంట్ కార్యదర్శిగా నామినేట్ చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు యువ నేత నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. తనకు ఈ పదవి కోసం కృషి చేసిన నియోజకవర్గం ఇన్‌ఛార్జి పడాల భూదేవికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవి తనకు మరింత బాధ్యతను పెంచిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మరింత కష్టపడి విజయం కోసం అందర్నీ కలుపుకుంటూ పనిచేస్తామని తెలిపారు.

ఆసుపత్రి పనుల పరిశీలన

ప్రజాశక్తి – గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భద్రగిరిలో కొత్తగా నిర్మిస్తున్న 50 పడకల ప్రభుత్వాసుపత్రి పనులను గురువారం ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన అనంతరం, మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి త్వరలోనే ప్రారంభానికి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆసుపత్రి ప్రారంభంతో స్థానిక ప్రజలకు వైద్య సదుపాయాలు మరింత అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు అడ్డాకుల నరేష్, తదితరులు ఉన్నారు.



ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జంఝావతి సమస్యకు పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి – కొమరాడ

జంఝావతి ప్రాజెక్ట్ సమస్యను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం ఆలోచించాల్సినవసరం ఎంతైనా ఉందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబ మూర్తి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలంలో రాజ్యలక్ష్మిపురం గ్రామ సమీపంలో 1976లో 2,460 ఎకరాల భూమికి నీరు అందించాలనే ఉద్దేశ్యంతో ఐదు మండలాల పరిధిలో జంఝావతి ప్రాజెక్టు నేటికీ 49 సంవత్సరాలు దాటిన నీరు అందని పరిస్థితి ఉందని అన్నారు. సమస్యను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వంలో ఉన్న అటు ఒరిస్సా ప్రభుత్వ ంతో వెంటనే సంప్రదింపులు చేయాలని కోరారు. 2006 నుండి పెండింగ్ ఉన్న తోటపల్లి సమస్యను పరిష్కరించాలని కోరారు.

రైతులరా... రండి.!

రైతులారా రండి.. జంఝావతిని సాధించుకుందామని జంఝావతి సాధన సమితి ప్రధాన కార్యదర్శి పల్లి రాజ్‌గోపాల్ నాయుడు పిలుపునిచ్చారు. గురువారం ఆ సమితి కార్యనిర్వాహక కన్వీనర్లు మరిశర్ల మాలతికృష్ణమూర్తి నాయుడు, వంగల దాలినాయుడు, అల్లు సత్యం తదితరులతో కలిసి జంఝావతి బాధిత గ్రామాలైన డంగభద్ర, కోనవలస, రాజ్యలక్ష్మీపురం, కంభవలస తదితర గ్రామాలలో పర్యటించి ఆయకట్టు రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలోని పెద్దలు, రైతులు, నాయకులు, సర్పంచులతో జంఝావతి సాధకబాధకాలపై చర్చించారు. ఇప్పుడు రాష్ట్రంలో, ఒడిస్సాలో కేంద్రంలో అనుకూల ప్రభుత్వాలు ఉండటంతో పాలకులు అధికారులు ఏమాత్రం చొరవ తీసుకున్నా జంఝావతి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగే అవకాశం ఉందన్నారు. ఆయకట్టు రైతులతో బాధిత గ్రామాల్లో సమితులు ఏర్పాటు చేసి ఆయా గ్రామ సమితులతో కలిసి త్వరలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సాధన దీక్షలు ప్రారంభిస్తామన్నారు. వాటికి రైతులంతా కదలి రావాలన్నారు.

గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త

ప్రజాశక్తి వీరఘట్టం

మండల కేంద్రంలోని దళిత, బాబు జగజ్జీవన్‌రాం కాలనీ, అక్కులపేట, కస్పావీధి, గాజుల మర్రి, గెంబలి తదితర వీధులతో పాటు నడుకూరు, ఎం రాజపురం, బిటివాడ, తదితర గ్రామాల్లో అపారిశుధ్యం విలయ తాండవిస్తుంది. స్వచ్ఛ సేవ– స్వచ్ఛ ఆంధ్ర, ఫ్రైడే డ్రై డే వంటి కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ నుంచి వివిధ స్థాయి అధికారుల వరకు దిగు స్థాయి సిబ్బందికి ఆదేశాలిస్తున్నప్పటికీ దిశగా చర్యలు లేకపోవడంతో ఎప్పటికప్పుడు కాలువల్లో చెత్తా చెదారాలు తొలగించకపోవడంతో ఎక్కడికి అక్కడే పేరుకుపోయి అపారిశుధ్యం విలయ తాండవిస్తుంది. ఈ కారణంగా ప్రజలు రోగాల బారినపడి వేలాది రూపాయలు వెచ్చించి ఆరోగ్యాన్ని నయం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కాలువలో పేరుకుపోయిన చెత్త

నిందితుడిపై పిట్ ఎన్‌డిపిఎస్ చట్టం

ప్రజాశక్తి–కంటోన్మెంట్

చట్టాన్ని తరుచూ ఉల్లంఘిస్తూ, ప్రజాశాంతికి భంగం కలిగిస్తూ, సమాజానికి ప్రమాదకరంగా మారుతూ విజయనగరం జిల్లాలో గంజాయి రవాణాలో 'కింగ్‌పిన్'గా వ్యవహరిస్తూ నిందితుడిగా పఠాన్ బాషా అలీ (31) పై అత్యంత కఠినమైన 'పిట్ ఎన్‌డిపిఎస్' చట్టాన్ని ప్రయోగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎస్‌పి ఎఆర్ దామోదర్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా, ఆమదాలవలస మండలం, కొత్తవీధికి చెందిన ప్రస్తుతం విజయనగరం పట్టణంలోని ఫూల్ బాగ్ లో నివాసం ఉంటున్నాడని తెలిపారు. ముందస్తు నేర నియంత్రణ చర్యల్లో భాగంగా గురువారం అతడిని నిర్బంధించి, విశాఖపట్నం కేంద్ర కారాగానికి తరలించామని తెలిపారు. పఠాన్ బాషా అలీ చెడు వ్యసనాలకు అలవాటు పడి, సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతూ వ్యవస్థీకృత నేరగాడిగా మారాడని పోలీసులు గుర్తించారు. గత నాలుగేళ్లలో విజయనగరం జిల్లా గంట్యాడ పోలీసు స్టేషనులో (1596.36 కిలోల) 1 గంజాయి కేసు, విజయనగరం 2వ పట్టణ పోలీసు స్టేషనులో (13.10 కిలోల) 2 గంజాయి కేసులు, బాపట్ల జిల్లా నిజాంపట్నం పోలీసు స్టేషనులో (1.5 కిలోల) 1 గంజాయి కేసులో (మొత్తం 4కేసులు) నిందితుడిగా అరెస్టు అయ్యాడని తెలిపారు. పఠాన్‌బాషా అలీ ప్రవర్తన సమాజానికి హానికరంగా మారుతున్న కారణంగా నేరాల నియంత్రణకు జిల్లా పోలీసుశాఖ చేపడుతున్న ముందస్తు చర్యల్లో భాగంగా పఠాన్ బాషా అలీపై 'పిట్ ఎన్‌డిపిఎస్' చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నుండి ఉత్తర్వులు వచ్చాయన్నారు. నిందితుడు పఠాన్ బాషా అలీపై ఇప్పటికే విజయనగరం 2వ పట్టణ పోలీసు స్టేషనులో సస్పెక్ట్ షీటు ఉందని ఎస్‌పి తెలిపారు. శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగించినా, గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణకు పాల్పడినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ, సమాజానికి ప్రమాదకరంగా మారితే ఉపేక్షించేది లేదన్నారు.

రైస్‌మిల్లుల్లో తనిఖీలు

ప్రజాశక్తి–గంట్యాడ

మండలంలోని రావి వలసలో శ్రీకనకదుర్గ రైస్‌మిల్లు, సిరిపురంలో శ్రీసూర్య రాజా రైస్‌మిల్లులో గురువారం తహశీల్దార్ నీలకంఠేశ్వర్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ధాన్యంతో వచ్చిన వాహనాలను వెంటనే కస్టోడియన్ ఆఫీసర్లు అనుమతించి, నిబంధనల మేరకు మిల్లర్‌కి అందజేయాలని సూచించారు. రైతుల నుంచి మిల్లర్లు అధిక ధాన్యాన్ని డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మురపాక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ధాన్యాన్ని సిద్ధం చేసుకున్న రైతులకు బ్యాంకు గ్యారంటీ అందుబాటులో ఉన్న మిల్లులకు జాప్యం లేకుండా వెంటనే ట్రక్‌షీట్ జనరేట్ చేయాలని కొనుగోలు కేంద్ర సిబ్బందిని ఆదేశించారు.

ఎట్టకేలకు ప్రారంభమైన రోడ్డు పనులు

ప్రజాశక్తి – పార్వతీపురం టౌన్

గత ఐదేళ్లుగా నరకయాతన అనుభవిస్తున్న వెంకంపేట గోలీల నుంచి ఎంఆర్ నగర్ వరకు బిటి రోడ్డు పనులు ఎట్టకేలకు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ రోడ్డున రావాలంటే భయపడ్డామని, తీవ్ర అవస్థలుపడ్డామని, ఇప్పుడు ఆ అవకాశం లేదని ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు, ఆటో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 'గత ఐదేళ్లలో ఈ రోడ్డు గుండా ప్రయాణం చేస్తూ నేను నరకయాతన పడ్డాను. అధికారులకు ప్రజాప్రతినిధి విన్నవించినా పట్టించుకోలేదు. ఎమ్మెల్యే విజయ్ చంద్ర కృషితో ఈ రోడ్డుకు మహార్దశ పట్టింది' అని కొప్పలవెలమ డైరెక్టర్ జి.వెంకట్‌నాయుడు, మండల అధ్యక్షుడు చంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక ప్రజా సంక్షేమ అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తుందని, ఎమ్మెల్యే విజయ్‌చంద్ర కృషితో వెంకంపేట రోడ్డు కొత్తగా నిర్మిస్తున్నారని, టిడిపి నాయకులు జాగాన రవి తెలిపారు.



రోడ్డును చదును చేస్తున్న రోలర్